## క్లుప్తంగా

### ఆదేశాలను పాటించని బడులపై చర్యలు తీసుకోవాలని

**నిజాంపేట్:** ప్రభుత్వ ఆదేశాలను పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి శివ ఓ ప్రకటనలో కోరారు. మార్చి 15 నుంచి పాఠశాలలను మధ్యాహ్నం వరకు మాత్రమే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. కాని కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరిస్తున్నాయని ఆరోపించారు. తమ ఇష్టానుసారంగా పాఠశాలలను నిర్వహిస్తున్న వారిపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక వేళ అధికారులు సదరు పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

### టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రకు విశేష స్పందన

**దుండిగల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెప్తారని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. గండిమైసమ్మ ప్రాంతానికి చెందిన పలువురు యువకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వారికి హన్మంత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారం చేజిక్కించుకుంటుందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన లభిస్తుందన్నారు. వివిధ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు, యువకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీకి వస్తున్నారని అన్నారు. వెంకట్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో చల్ల ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ ముదిరాజ్ పార్టీలో చేరారు.

### కార్మికుల సంక్షేమమే బీఆర్ఎస్‌కేవీ లక్ష్యం

**రంగారెడ్డినగర్:** కార్మికుల సంక్షేమమే పరమావధిగా బీఆర్ఎస్‌కేవీ పనిచేస్తుందని శ్రమశక్తి అవార్డు గ్రహీత, బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర నాయకుడు రవిసింగ్ అన్నారు. కొంపల్లి ప్రాంతంలోని రాయల్ ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ గోదాంలో ప్రవీణ్ అనే వ్యక్తి గత 7 సంవత్సరాలుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల డ్యూటీలో ఉండగా ప్రవీణ్‌కు హార్ట్‌ఎటాక్ రావడంతో మృతిచెందాడు. ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం ఎటువంటి సహాయం చేయకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు రవిసింగ్‌ను ఆశ్రయించారు. దీంతో ఆయన ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యంతో చర్చించగా రూ.7 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించింది. ఆ నగదును శుక్రవారం చెక్కు రూపంలో ప్రవీణ్ కుటుంబ సభ్యులకు రవిసింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానని, కార్మికుల శ్రేయస్సు కోసం ఎంతవరకైనా పోరాడతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌చారి, సంతోష్‌గౌడ్, ప్రశాంత్, మనోజ్‌కుమార్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కంటివెలుగు కేంద్రం ప్రారంభం

**దుండిగల్:** కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. శ్రీరాంకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ అర్హులన్నారు. ని, కంటి పరీక్షలకు వెళ్లేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకెళ్లాలని కోరారు. కంటి వెలుగు కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు సంబంధిత వైద్య సిబ్బంది పరీక్షలు చేస్తారని, అనంతరం ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నర్సింగం భారత్ కుమార్, అమరం గోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఆరోగ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

**పరారీలో మరో వ్యక్తి**

**జీడిమెట్ల:** గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని మాదాపూర్ ఎస్‌ఓటీ, జీడిమెట్ల పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన మోహన్, హైదరాబాద్ గాంధీనగర్‌కు చెందిన బి.యశ్వంత్‌లు ప్రైవేట్ ఉద్యోగులు. కాగా వీరిద్దరు సులభంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి వ్యాపారాన్ని ఎంచుకున్నారు. ఇద్దరు కలిసి గుంటూరుకు చెందిన శ్యాంకుమార్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి నగరంలో అవసరం ఉన్న వారికి ఎక్కువ రేటుకు విక్రయిస్తుంటారు. అదే విధంగా శుక్రవారం శ్యాంకుమార్ వద్ద 7కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. అనంతరం గంజాయిని షాపూర్‌నగర్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే జీడిమెట్ల పోలీసులతో కలిసి ఎస్‌ఓటి పోలీసులు గంజాయి అమ్మేందుకు ప్రయత్నిస్తున్న మోహన్, యశ్వంత్‌లను షాపూర్‌నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 7కిలోల గంజాయి, రెండు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కేసులు నమోదు చేశారు. ఏ3గా ఉన్న శ్యాంకుమార్ పరారీలో ఉన్నాడు. గంజాయి విలువ సుమారు రూ.2.4లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

# అకాల వర్షం..
# లోతట్టులో భయం

- రాత్రంతా నిలిచిన విద్యుత్ సరఫరా
- రోడ్లపై వరద ప్రవాహం
- పేరుకుపోయిన బురద, వ్యర్థాలు

**కుత్బుల్లాపూర్:** అకాల వర్షాలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం ఉదయం వరకు కురిసిన వర్షాలతో ఎక్కడికక్కడ రహదారుల్లో వరదనీరు నిలవడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వెంకటేశ్వర కాలనీ, గోదావరి హోమ్స్ రాఘవేంద్ర కాలనీ తదితర ప్రాంతాల్లో రాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోగా ఉదయం 9 గంటల వరకు సరఫరా మెరుగుపరచలేదు. దీంతో లైన్‌మెన్ రమేష్‌రెడ్డిని పలువురు ఫోన్లో సంప్రదించగా పలు కాలనీలో సరఫరా పునరుద్ధరించారు.

**అయోధ్యనగర్...**

- అయోధ్యనగర్ ప్రధాన రోడ్డు జీడిమెట్లకు ఇటు కుత్బుల్లాపూర్ వెళ్లే వాహనదారులు, కార్మికులు నడవడానికి వీలు లేకుండా బురదమయంగా


స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలో రోడ్డుపై పోటెత్తిన వరద

మారింది. శివాలయం టెంపుల్ సమీపంలో రోడ్డు డ్రైనేజీ పనులు జరుగుతుండగా అకస్మాత్తుగా కురిసిన వర్షంతో ఒక్కసారిగా వర్షపు నీరు భారీగా చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

**స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ...**

- స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, మీనాక్షి తదితర ప్రాంతాల్లో వర్షం పడ్డాదంటే చాలు. లయోలా కాలేజీ నుంచి అల్వాల్ మీదుగా వచ్చే వర్షపు నీరంతా తేజ వైన్స్ రోడ్డు మొత్తం బ్లాక్ కాగా స్ప్రింగ్ ఫీల్డ్ ప్రధాన రోడ్డు నడవడానికి వీలు లేకుండా రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించింది.


అయోధ్యనగర్‌లో బురదమయంగా మారిన రోడ్డు

ప్రతిసారి ఇదే సమస్య ఎదుర్కొంటున్నామని కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.

**శ్రీనివాస్‌నగర్...**

- జీడిమెట్ల డివిజన్ పరిధిలో శ్రీనివాస్‌నగర్ ఫేజ్–1, 2లలో వరదనీరు రోడ్డుపై నిలిచిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా స్ట్రోమ్ వాటర్ లైన్‌ను నిర్మాణం చేపట్టాలని స్థానికంగా పర్యటించిన బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి కోరారు.
- రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐపీడీఎల్ నుంచి రంగారెడ్డినగర్ ప్రధాన రోడ్డుని స్వామి వివేకానంద విగ్రహం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా డ్రెయిన్‌లను నిర్మిస్తే సమస్య తీరుతుందని స్థానికులు కోరుతున్నారు.


శ్రీనివాస్‌నగర్ కాలనీలో చేరిన వర్షపునీరు


శ్రీనివాస్‌నగర్‌కాలనీలో పర్యటిస్తున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

# లో–వోల్టేజీ సమస్యను పరిష్కరిస్తాం

**బాచుపల్లి ఏఈ శాంతకుమార్**



**నిజాంపేట్:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ సరఫరాలో అంతరాయం, గంటల తరబడి విద్యుత్ కోత,రాత్రి సమయంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సరైన విధంగా సిబ్బంది స్పందించకపోవడం. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటులో నిర్లక్ష్యం. విద్యుత్ తీగాలు తెగిపడుతుండటం తదితర సమస్యలపై బాచుపల్లి విద్యుత్ ఏఈ శాంతకుమార్‌తో సాక్షి ఇంటార్వ్యూ.

**ప్రశ్న:** వర్షం పడ్డ ప్రతిసారి రాత్రి సమయంలో గంటల తరబడి... ఒక్కోసారి తెల్లవారే వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. కారణం ఏమిటి?

**జవాబు:** వర్షం కురిసిన సమయంలో ఈదురు గాలులు విపరీతంగా వస్తుంటాయి. చెట్ల కొమ్మలు విరిగిపడుతుంటాయి. వీటి మూలంగా డిస్కులు, ఇన్సిలేటర్స్ ఫెయిల్ అవుతుంటాయి. వీటి కారణంగా వర్షం పడ్డప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. దీనిని వెంటనే గుర్తించి మేము చేపట్టాల్సిన చర్యలు వెంటనే చేపడున్నాం.

**ప్రశ్న:** ప్రజల నుంచి ఫిర్యాదులు చేసే సమయంలో ఫోన్‌లు చేస్తే సిబ్బంది స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.. ఎందుకు?

**జవాబు:** అలాంటిది ఏమి లేదు బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యలు ఉంటే 9490153522 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు 24 గంటలు తమ అత్యవసర సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఒక్కోసారి ఫిర్యాదులు ఎక్కువగా రావొచ్చు. అలాంటప్పుడు ఒక దగ్గర సమస్య పరిష్కారంలో సిబ్బంది ఉన్నప్పుడు కొంత సమయం పడుతుంది. అంతే కాని నిర్లక్ష్యం ఉండదు.

**ప్రశ్న:** అక్కడక్కడ విద్యుత్ తీగలు తెగిపోవడానికి కారణాలు ఎమిటి? దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి కదా?

**జవాబు:** 25 సంవత్సరాల నాటి కండక్టర్ల్ ఉన్న విద్యుత్ తీగలు కొన్ని ప్రాంతాల్లో ఉన్నాయి. అలాంటి ప్రాంతాల్లోనే ఇలాంటి సంఘటనలు జరుగుతుంటాయి. ఈ సమస్య పరిష్కారానికి రూ.10లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో ఈ పనులు పూర్తి చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

**ప్రశ్న:** లో–వోల్టేజీ కారణంగా విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీని పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

**జవాబు:** ఈ సమస్యను అధిగమించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం 5 ట్రాన్స్‌ఫార్మర్ల కోసం నిధులు కూడా మంజూరయ్యాయి. త్వరలోనే సమస్య ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తాం.

**ప్రశ్న:** ఈ మధ్య కాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఎందుకు వస్తోంది.?

**జవాబు:** చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగినప్పుడు వాటిని ట్రిమ్మింగ్ చేసేందుకు విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వస్తోంది. అదే విధంగా ఫీడర్ మరమ్మతుల కారణంగా కూడా అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేయాల్సి ఉంటుంది.



షాపూర్‌నగర్ చౌరస్తాలో సంబరాల్లో జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

**కుత్బుల్లాపూర్:** హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీగా బీజేపీ బలపరిచిన ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంతో శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. షాపూర్‌నగర్ చౌరస్తాలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన విజయోత్సవ సంబరాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఇదే తరహాలో అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రాముగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్‌రెడ్డి, గరిగే శేఖర్‌ముదిరాజ్, డివిజన్ల అధ్యక్షులు సాయినాథ్ నేత, కంది శ్రీరాములు, రాజేశ్వరరావు, పున్నారెడ్డి, దుర్యోధనరావు, పులి బలరామ్ తదితరులు పాల్గొన్నారు

**దుండిగల్ మున్సిపాలిటీలో**

**దుండిగల్:** ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు బీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి నాంది అని రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన ఏవీఎన్ రెడ్డి ఘన విజయం సాధించిన సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో గండిమైసమ్మ చౌరస్తాలో నిర్వహించిన వేడుకలకు మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో బీజేపీ అధికారాన్ని చేపట్టడం ఖాయమన్నారు. ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర గిరజన మోర్చా కార్యదర్శి శ్యామ్‌రావు, జిల్లా నాయకులు గోనె మల్లారెడ్డి, ఆకుల మల్లేష్, వెంకటేష్ నాయక్, శంకర్‌రెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, ఆకుల విజయ్, సుమన్‌రావు పాల్గొన్నారు.


దుండిగల్‌లో..

## ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి


ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న స్థానికులు

**చింతల్:** ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతి యాత్రలో భాగంగా శుక్రవారం చింతల్ డివిజన్ పరిధిలోని రంగానగర్, సాయినగర్, దుర్గయ్యనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సాయినగర్‌లో భూగర్భ డ్రైనేజీ లైన్ పూర్తయిన నేపథ్యంలో రోడ్డు వేయాలని, రంగానగర్‌లో వర్షపునీరు నిలవకుండా డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని, పార్కులో షెడ్డు, ప్రహరీ గోడ నిర్మించాలని, దుర్గయ్యనగర్‌లో కల్వర్టు నిర్మాణం చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేయించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

- జీడిమెట్ల ఇండస్ట్రియల్ ప్రాంతంలో గల సూపర్ మ్యాక్స్ కంపెనీ కార్మికులు గత 7 నెలల నుంచి జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో 19వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలియజేశారు. సూపర్ మ్యాక్స్ కార్మికులకు అండగా ఉంటానని, కార్మిక మంత్రి మల్లారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సూపర్ మ్యాక్స్ యూనియన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మేయర్ నీలారెడ్డిని సన్మానిస్తున్న కమిషనర్ రామక్రిష్ణారావు

**నిజాంపేట్:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని... ఏ రంగంలో ఉన్న అక్కడ తమదైన ముద్ర వేసుకోగలుగుతున్నారని మేయర్ కొలను నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మేయర్ అధ్యక్షుతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు, ఉద్యోగులు, కార్మికులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన శంభీపూర్‌రాజు కుటుంబీకులు



**దుండిగల్:** మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల శాసనమండలి విప్‌గా నియమితులైన శంభీపూర్ రాజు తన కుటుంబసభ్యులతో కలిసి ప్రగతి భవన్‌కు వెళ్లి కేసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన తల్లిదండ్రులు అంజయ్య, వినోద, సతీమణి లావణ్య, తమ్ముడు, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, మరదలు, దుండిగల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి ఉన్నారు.

## 'రాష్ట్రంలో నిరంకుశ పాలన'

**కుత్బుల్లాపూర్:** రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందని మేడ్చల్ జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షల పేపర్ లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ఉదాసీనతకు వ్యతిరేకంగా, నిరుద్యోగులకు అండగా వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకోవడాన్ని సురేష్‌రెడ్డి ఖండించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాక్షస పాలన, తాలిబన్ల పాలన సాగుతుందనడానికి పోలీసుల జులుమే నిదర్శనమని, ఉద్యోగ నోటిఫికేషన్‌లు అంటూ పేపర్ లీక్ చేసి మంత్రులు, బీఆర్ఎస్ నాయకులు వందల కోట్ల రూపాయల స్కాంకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ స్కాంలో పెద్దల పాత్ర ఉందని, సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలు ప్రజల కోసం ధర్నా చేస్తుంటే అరెస్ట్ చేయిస్తున్న సీఎం కేసీఆర్ లిక్కర్ కేసులో అడ్డంగా దొరికిన తన కుమార్తెను మాత్రం ఇంటి వద్దనే విచారించాలని చెప్పడం సిగ్గుచేటన్నారు.వైఎస్ షర్మిల సీఎం అయితే రాష్ట్రంలో రాజన్న రాజ్యం వస్తుందన్నారు.

## జర్నలిస్టుపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


**జీడిమెట్ల:** జర్నలిస్టుపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని శుక్రవారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. కుత్బుల్లాపూర్‌కు చెందిన ప్రముఖ దినపత్రిక రిపోర్టర్ నరేందర్ గురువారం రాత్రి జీడిమెట్లలోని కొపల్లె ఫార్మా పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదాన్ని న్యూస్ కవర్ చేయడానికి వెళ్లాడు. తోటి జర్నలిస్టులతో కలిసి అగ్నిప్రమాద దృశ్యాలను క్లిక్ చేస్తున్నాడు. ప్రమాదం జరిగిన పక్కనే ఉన్న ఒక కుక్క పిల్లల పెంపకం షెడ్డు వద్ద ఫొటోలు తీస్తున్నాడు.

- ఈ క్రమంలో షెడ్డుకు సంబంధించిన వ్యక్తి రాజ్‌కుమార్ అనే యువకుడు నరేందర్‌తో వాగ్వాదానికి దిగాడు. అక్కడే ఉన్న పోలీసులు, తోటి విలేకరులు రాజ్‌కుమార్‌ను నిలువరించారు. 10 నిమిషాల తర్వాత నరేందర్ ఇంటికి వస్తుండగా అక్కడే కాపు కాసిన రాజ్‌కుమార్, అతడి స్నేహితులు మరికొంత మంది నరేందర్‌పై దాడి చేశారు. ఈ విషయమై నరేందర్ తోటి విలేకరులతో కలిసి జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మహేందర్‌రెడ్డి, శివాజీ, జనార్ధన్‌రెడ్డి, లియాఖత్ అలీ, తదితరుల ఉన్నారు.

**జర్నలిస్టులుపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి..**

అనవసరంగా జర్నలిస్టుపై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ విషయమై జర్నలిస్టు సంఘం రాష్ట్ర టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీసాగర్, ఐజేయూ జర్నలిస్టు నాయకులు రంగు వెంకటేష్‌గౌడ్ సీఐ పవన్‌తో ప్రత్యేకంగా మాట్లాడి దాడిని తీవ్రంగా ఖండించారు.

## వ్యక్తి అదృశ్యం


యాదగిరి(ఫైల్)

**జీడిమెట్ల:** ఊరికి వెళ్తున్నానని ఇంటి నుంచి చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన యాదగిరి(63) ఈనెల 11న రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో ఉండే తన కూతురు శ్రావణి ఇంటికి వచ్చాడు. రెండు రోజుల అనంతరం 13వ తేదీన తిరిగి సదాశివపేట్ వెళ్తున్నానని చెప్పి గాంధీనగర్ నుంచి బయలుదేరాడు. మరునాడు క్షేమంగా చేరుకున్నాడా అని శ్రావణి తన తమ్ముడి సాయికి ఫోన్ చేస్తే రాలేదని చెప్పాడు. దీంతో కంగారు పడిన కుటుంబీకులు యాదగిరి అల్లుడు శ్రీకాంత్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అద్దె భవనంలోనే...
# సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం


రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలు


సూరారంలో అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయం

**సుభాష్‌నగర్:** ఆదాయంలో మేటి.. కాని సమస్యలతో సవారి.. ఆదాయం రాబట్టడంతో దిట్ట.. కానీ సమస్యలలో మాత్రం తంటా అన్న చందంగా మారింది. సూరారంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం. కొన్ని సంవత్సరాలుగా అరకొర వసతులతో అద్దె భవనంలోనే కార్యాలయాన్ని నెట్టుకొస్తున్నారు. ప్రతిరోజు సుమారు 100 రిజిస్ట్రేషన్‌లు జరిగే ఈ కార్యాలయంతో ప్రతి ఏటా ప్రభుత్వానికి రూ.10కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. ఇంత ఆదాయం ఉన్నప్పటికి సొంత భవనం లేకపోవడం నామోషిగానే ఉంది.

**ఏళ్ల నుంచి ఇక్కడే..**

కుత్బుల్లాపూర్ గతంలో మేడ్చల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో ఉండేది. పెరిగిన జనాభా దృష్ట్యా 2006లో కుత్బుల్లాపూర్‌కు ప్రత్యేక ప్రత్యేక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి సూరారంలోని ప్రధాన రహదారి పక్కన అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతుంది.

**వివిధ పనుల నిమిత్తం..**

కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిత్యం క్రయవిక్రయదారులతో రద్దీగా ఉంటుంది. ప్రతిరోజు 100 రిజిస్ట్రేషన్‌లతో పాటు గిఫ్ట్‌డీడ్, జీపీఏ, సేల్‌డీడ్, మార్టిగేజ్, మ్యారేజ్ రిజిస్ట్రేషన్స్, ఈసీ, మార్కెట్‌వ్యాల్యూ, సీసీ కాపీ, బాండ్‌పేపర్‌ల నిమిత్తం కార్యాలయానికి వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఈ క్రమంలో ప్రజలు వాహనాలు, జనాలతో కార్యాలయ ప్రాంతాలు కిక్కిరిసిపోతాయి.

**కార్యాలయం రావాలంటే ట్రాఫిక్ చలాన్ కట్టాల్సిందే..**

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికావాలంటూ ప్రజలు గంటల తరబడి వేచి ఉండాలి. సర్వర్ డౌన్ కారణంగా ఒక్కోసారి రిజిస్ట్రేషన్ రెండు రోజుల పడుతుంది. దీంతో వాహనదారులు పార్కింగ్ సదుపాయంలేక ఫుట్‌పాత్, రోడ్లపైన వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ప్రజలు కార్యాలయం నుంచి వచ్చేసరికి ట్రాఫిక్ పోలీసులు చలాన్‌లు విధిస్తున్నారు. దీంతో ప్రజలు కార్యాలయానికి రావాలంటే సరైన పార్కింగ్ సదుపాయం లేక ప్రజలు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. భవనం కింద ఉన్న పార్కింగ్ స్థలాన్ని సైతం కొంత భాగాన్ని అద్దెలకు ఇవ్వడంతో సమస్య మరింత జఠిలంగా మారింది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..**

అద్దె భవనంలో నడుస్తున్న సబ్ రిజిష్టార్ కార్యాలయంలో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది ఏర్పడుతుందనేది నిజమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా.

– జ్యోతి (సబ్‌రిజిస్ట్రార్)

**ఎకరాల స్థలం కేటాయించండి..**



100రూపాయల బాండ్ పేపర్‌కోసం కార్యాలయానికి వచ్చే వాహనదారులకు రోడ్డుపై పార్కింగ్ కారణంగా 500 చెల్లించాల్సి వస్తుంది. స్థానికంగా ప్రభుత్వ స్థలం చాలా ఉంది. అధికారులు స్పందించి ప్రజా అవసరాల నిమిత్తం ఎకరా స్థలం కేటాయిస్తే బాగుంటుంది.

– రవీందర్ ముదిరాజ్ (సూరారం)